క్లుప్తంగా

అడిగిన సమాచారం ఇవ్వాల్సిందే..



మరడాం గ్రామ సభలో మాట్లాడున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

దత్తిరాజేరు: ప్రతి పౌరుడికి అడిగిన సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. చౌదంతివలస, కె.కొత్తవలస, మరడాం గ్రామ సచివాలయాలు వద్ద సమాచార హక్కు కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం గ్రామ సభలు నిర్వహించి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. గ్రామాలలో జరుగున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి సమాచారం అడిగి తెలుసుకోవచ్చునని అన్నారు. లిఖిత పూర్వకంగా కావాలన్న దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలోనే సమాచారం ఇవ్వడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ సమాచారం అడిగి తెలుసుకోవాలని సూచించారు.

ఘనంగా శంకరాచార్య జయంతి



సూర్య దేవాలయంలో జగద్గురు శంకరాచార్యకు ప్రత్యేక పూజలు

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక సూర్య దేవాలయంలో శుక్రవారం జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో రుద్రాభిషేకం, ఇతర పూజాధికాలు నిర్వహించారు. ఆదిశంకరాచార్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసి గురుపూజ చేశారు. విన్నకోట భాస్కర్‌శర్మ, విన్నకోట సూర్యనారాయణశర్మ, దంపతులు పూజాధికాలు చేశారు. ఉదయం 5గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నివర్వహించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు బ్రాహ్మణ దంపతులు, వివిధ ఆలయాల అర్చకులు, పురోహితులు, వేద పండితులు, బ్రాహ్మణ సంఘం సభ్యులు పి.ముకుంద్, జి.సత్యసాయి, పదాల ధర్మారావు, వి.శంకరరావు, శ్రీను, రాంబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొండపల్లి: మండలంలో గురువారం అర్ధ రాత్రి వీచిన ఈదురుగాలులుతో పాటు కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాలులు కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లు తెగి పడటంతో పాటు చెట్లు కొమ్మలు విద్యుత్ స్తంభాలపై పడడంతో శుక్రవారం మధ్యాహ్నం వరకు దేవపల్లి, గొల్లుపాలెం తదితర గ్రామాలకు సరఫరా నిలిచి పోయింది. విద్యుత్ శాఖ సిబ్బంది కొమ్మలను తొలగించి, వైర్లును సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కూలిన చెట్లు, గుంతల్లో చేరిన నీరు

గజపతినగరం: మండల కేంద్రంలో గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి పలు చోట్ల చెట్లు కూలి వర్షపు నీరు ఎక్కడికక్కడ చేరడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భారీగా కురిసిన వర్షం వలన రోడ్లు, గుంతల్లో నీరు చేరడంతో రాక పోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈదురు గాలులు వల్ల గజపతినగరం శివాలయం వెనుక ఉన్న వీధిలో రహదారిపై చెట్టు కూలి పోయింది. భారీ వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం నేల కూలిన చెట్టును అధికారులు పక్కకు నెట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల గడువు పెంపు

కొత్తవలస: బాలల నిర్బంధ ఉచిత విద్య విద్యా హక్కు చట్టంలో బాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 19వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఎంఈఓ జి.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు 25 శాతం సీట్లు అర్హత కలిగిన పేద విద్యార్థులకు కేటాయించాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలి

పూసపాటిరేగ: చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా పని చేయాలని ఎంపీడీఓ ఎం.రాధిక అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పునరుత్పత్తి ఆరోగ్యం, బాల్య వివాహాలు వలన కలిగే దుష్ప్రభావా లు, కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

దాహం తీర్చని నీటి తొట్టెలు

• నిర్మాణం సరే.. వినియోగం ఎప్పుడు..!



పురిటిపెంట గ్రామంలో వృథాగా ఉన్న నీటి తొట్టె



దోలపాలెంలో నిర్మాణంలో ఉన్న నీటి తొట్టె

గజపతినగరం రూరల్: వేసవి నేపథ్యంలో మూగజీవాల దాహార్తితో అల్లాడుతున్నాయి. రోజురోజుకు ఎండలు మండిపోతుండడంతో ఎక్కడికక్కడే వాగులు, కుంటలు, చెరువులు నీటి వనరులు అడుగంటిపోతున్నాయి. ఈ క్రమంలో మూగజీవాల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 31 పంచాయతీలకుగాను తొలి విడతలో 21 గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించారు. అయితే ఆ.. తొట్టెలలో అధికారులు కొన్నింటిలో నీటిని నింపి మరికొన్నింటిని వృథాగా విడిచిపెడుతుండడంతో నిరుపయోగంగా మారాయి. మండలంలో 21 పంచాయతీలలో నీటి తొట్టెల నిర్మాణం చేపట్టారు. ఒక్కో తొట్టెకు రూ.35,443లను ఖర్చు చేసి రూ.7లక్షల 44,303లతో నిర్మాణాలు జరిపారు. అయితే నిర్మాణాలు పూర్తి చేసినా...వినియోగంలోకి తీసుకు రాకుండా వృథాగా ఉంచేయడంతో ఏం ప్రయోజనమని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరుతో మూగజీవాల దాహార్తి తీరడం లేదని పేర్కొంటున్నారు. నిర్మించిన నీటి తొట్టెల్లో నీటిని నింపితే చాలా వరకు మూగజీవాల దాహార్తి తీరే అవకాశం ఉందని, లక్ష్యం కూడా నెరవేరుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు సూచిస్తున్నారు.

నీటి సౌకర్యం కల్పించాలి

పంచాయతీ పాలకులు, సంబంధిత అధికారులు గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్టెల్లో నీటిని నింపి మూగజీవాల దాహార్తిని తీర్చాలి. రోజురోజుకు ఎండలు మండిపోతుండడంతో మూగజీవాలు దాహార్తితో ఇబ్బందులు పడుతున్నాయి. అధికారులు సానుకూలంగా ఆలోచించి వాటి దాహార్తిని తీర్చాలి.

– చనపతి రామునాయుడు, రైతు, దోలపాలెం

నీటితో తొట్టెలను నింపమని చెప్పాం

గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయిన తొట్టెల్లో నీటితో నింపమని ఆయా క్షేత్ర సహాయకులకు ఆదేశాలు జారీ చేశాం. తొట్టెలు ఖాళీ కాగానే నింపడం జరుగుతుంది. ఎక్కడైనా వృథాగా ఉన్నట్లు తన దృష్టికి రాలేదు. తక్షణమే దృష్టి సారించి అన్నింటిని వినియోగంలోకి తీసుకువస్తాం.

– కృష్ణవేణి ఏపీఓ, గజపతినగరం

స్వామికి స్నపన తిరుమంజనం

వేపాడ మండల కేంద్రంలో శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి శుక్రవారం స్నపన తిరుమంజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ మంత్రోచ్చారణాలతో స్వామివారికి సుగంధ ద్రవ్య అభిషేకం, పంచామృతాభిషేకం, పసుపుకుంకుమలతో అలంకరణ, క్షీరాభిషేకం, నక్షత్ర హారతి, కర్పూర, కుంభ హారతి, పట్టు వస్త్రాలంకరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– వేపాడ



ఆరోగ్యంపై రసాయన ప్రభావం



రసాయనాలతో మగ్గపెట్టిన మామిడిపండ్లు

చీపురుపల్లి రూరల్(గరివిడి): స్వచ్ఛమైన ఫలాలు మనిషికి ఎంతో మంచి ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. మార్కెట్లో దొరికే అన్ని రకాల పండ్లు ఆరోగ్యమే. ప్రస్తుతం మామిడి పండ్లు సీజన్. మామిడి ఏడాదికోసారి దొరికే ఫలం. ఏడాదికోసారైన సామాన్యుడు కొనుక్కొని తినగలిగే తక్కువ ధరలో లభించే ఫలం. మామిడితో పాటుగా మనిషికి మంచి ఆరోగ్యాన్ని అందించే పండ్లలో అరటి పండు కూడా ఆరోగ్య ప్రదాయినిగా చెబుతారు. అరటి పండ్లు సరసమైన ధరకు సామాన్యుడికి ఏడాది పొడవునా దొరికే ఫలం. సామాన్యుడు తినగలిగే అరటి, మామిడి పండ్లపై రసాయనాల ప్రభావంతో ఆకర్షించే రంగుల్లోకి తీసుకువచ్చి ప్రజలకు అమ్ముతున్నారు. ఇలాంటి పండ్లు తింటే ఆరోగ్యాలు పాడవుతాయని తెలిసినా ఏడాదికోసారే కదా, ఏడాది పొడవునా దొరకవు కదా అని చెప్పి కొనుగోలు చేసి తింటున్నారు. ఈ పండ్లును తిని అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నారు. ఈ రకమైన రసాయనాలతో కూడిన పండ్లును యథేచ్ఛగా అమ్మకం చేస్తున్నప్పటికీ పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఇలాంటి ప్రభావం మరింత పెరుగుతుందని కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు రైతు వినియోగించే రసాయనాలు, పండ్లను మగ్గబెట్టేందుకు వాడే కార్బయిడ్ వంటి రసాయనాల ప్రభావంతో మనం తినే ఆహార పదార్థాలు, పండ్లు విషతుల్యమవుతున్నాయి. ఇలాంటి విషతుల్య ఆహారం తీసుకోవటం వలన కేన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువుగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

వృద్ధులకు రవాణా సదుపాయం



చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో వృద్ధులతో కానిస్టేబుళ్లు

చీపురుపల్లి: పూరి కోణార్క్ సూర్యదేవుని దర్శనం చేసుకుని తిరిగి వచ్చిన నిరాశ్రయులైన వృద్ధులకు రవాణా సదుపాయాన్ని సీఐ జి.శంకరరావు కల్పించినట్టు రాహుల్ సౌరభ్ నిత్య అన్నదాన సత్రం నిర్వాహకుడు వావిలపల్లి సిద్దార్థ తెలిపారు. రాజాం నియోజకవర్గంలోని వావిలవలసలో రాహుల్ సౌరభ్ నిత్య అన్నదాన సత్రంకు చెందిన వృద్ధులను ఇటీవల పూరి కోణార్క్ సూర్యదేవుని దర్శనం కోసం తీసుకెళ్లినట్లు చెప్పారు. తిరుగు ప్రయాణంలో గురువారం రాత్రి చీపురుపల్లిలోని రైల్వేస్టేషన్‌కు చేరుకున్నట్లు చెప్పారు. చీపురుపల్లి రైల్వేస్టేషన్ నుంచి రాజాం నియోజకవర్గంలోని వావిలవలస వరకు మూడు ఆటోల్లో ఉచితంగా వృద్ధులకు రవాణా సదుపాయంతో పాటు ఆహార పదార్థాలు అందజేశారని చెప్పారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణా శిబిరం

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం నుంచి వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్టు వ్యాయామ ఉపాధ్యాయులు స్వరూప్, మురళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు సంవత్సరాల వయస్సు నుంచి 16 సంవత్సరాల వయస్సు కలిగిన బాల, బాలికలు శిక్షణా శిబిరానికి అర్హులని తెలిపారు. షటిల్, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా బంగారునాయుడు

శృంగవరపుకోట: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని అంబాదాసుపాలెం గ్రామానికి చెందిన గడి బంగారునాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాలనుసారం జిల్లా పార్టీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ నియామక పత్రం అందజేశారు. పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బంగారునాయుడు తెలిపారు.

ప్రత్యేక ఆధార్ నమోదు ఇలా...

వేపాడ: మండలంలో ప్రత్యేక ఆధార్ అప్‌డేట్ క్యాంపు షెడ్యూలును ఎంపీడీఓ సిహెచ్.సూర్యనారాయణ శుక్రవారం ప్రకటించారు. షెడ్యూలు వివరాలు ఇలా వున్నాయి. మే 5, 6 తేదీల్లో వీలుపర్తి, బానాది, కొండగంగుబూడి, 7, 8 తేదీల్లో జాకేరు, నీలకంఠరాజపురం, బొద్దాం, రామస్వామిపేట గ్రామాల్లో, 12, 13 తేదీల్లో దబ్బిరాజుపేట, వావిలపాడు పాటూరు, 14న ఆతవ, బల్లంకి, 15న వేపాడ, నల్లబిల్లి, 14, 15 తేదీల్లో శింగరాయి గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో 0–6 సంవత్సరాల పిల్లలు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయడం, ఆధార్ కార్డులో చిరునామా ఇతర మార్పులు, ఇతర జాబ్ కార్డులు అప్‌డేట్ కొత్త ఆధార్ నమోదు చేయనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.

సమన్వయంతోనే గ్రామ స్వరాజ్యం

వేపాడ: గ్రామాల అభివృద్ధి సాధించినప్పుడే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని ముకుందపురంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షలతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణంలో ముకుందపురం, బర్లవాని కళ్లాల నుంచి ఎస్.కోట మండలం వశి, తాటితోట కళ్లాలకు లింకు రోడ్డు ఏర్పడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల మంజూరులో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న బహుజన నాయకులు

లక్కవరపుకోట: కూటమి ప్రభుత్వం ఏర్పాడి ఏడాది కావస్తున్నా ఎస్సీ, ఎస్టీల సంక్షేమ పథకాలు మంజూరు చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని బహుజన నేత అతవ ఉదయభాస్కర్ మండిపడ్డారు. మండల కేంద్రంలో ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలతో పాటూ మరిన్ని అదనపు పథకాలు అమలు చేస్తామని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ అధినేత చంద్రబాబునాయుడు పూర్తిగా సంక్షేమ పథకాలను విస్మరించారని దుయ్యబట్టారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయింది అన్న సామెతలా చంద్రబాబు పాలను ఉందంటూ ధ్వజమెత్తారు. ఎస్సీలకు భూమి కొనుగోలు పథకం, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, సబ్‌ప్లాన్ నిధులు, సంక్షేమ హాస్టల్స్, జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ భవనాలు ఇలా పలు పథకాలు నేటికీ అమలు కాలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర స్థాయి ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. ఆయన వెంట దళిత బహుజన ఫ్రంట్ నాయకులు పేడ సూరిదేముడు, డెంకాడ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కిశోరీబాలికలకు సామాజిక అంశాలపై చైతన్యం



కిశోరీ బాలికలనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

• ఆర్‌జేడీ చిన్మయిదేవి

కొత్తవలస: కిశోరీ బాలికలు సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి అన్నారు. ఐసీడీఎస్ వియ్యంపేట ప్రాజెక్టు పరిధి ముసిరాం గ్రామంలో ఏపీ మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా కిశోరీ బాలికా వికాసం వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరీ బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. వచ్చేనెల 10వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. సీడీపీఓ రొంగలి ఉమాదేవి మాట్లాడుతూ కిశోరీ బాలికలను చైతన్య పర్చుతామన్నారు. వివిధ అంశాలపై ఏఎన్ఎంలు, మహిళా పోలీస్‌లు, వీఓలు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ నెల 6న రుతుక్రమం పరిశుభ్రత, లైంగిక విద్య, 9న పునరుత్పత్తి ఆరోగ్యం, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, 13న బాలల హక్కుల రక్షణ, పోక్సో చట్టం, 16న కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 20న ఆడపిల్లల పట్ల లింగవివక్ష, అసమానతలు, 23న ఉన్నత విద్య, నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వం, 27న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, విధ సమస్యలు ఎదుర్కోవడం, 30న ఆర్థిక అంశాలు నిర్వహణ, పొదుపు, జూన్ 3న కౌమార బాలికల నాయకత్వం, సాధికారత, 6న శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటలు ప్రాముఖ్యత, చివరిగా 10వ తేదీన బాల్య వివాహాలు వల్ల కలిగే దుష్ప్రభావాలు, నివారణపై కిశోరీ బాలికలకు అవగాహన కల్పిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సహాయ సీడీపీఓ లక్ష్మీబాయి, అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్స్ కె.రమణమ్మ, కె.వి.స్వర్ణలత, అంగన్‌వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, శ్యామల, పలువురు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మహిళా పోలీస్‌లు, వీఓఏలు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు వితరణ



ఆశ్రమ పాఠశాలకు వాటర్ కూలర్‌ను అందజేస్తున్న ఎస్‌బీఐ ఓల్డు సిబ్బంది

కొత్తవలస: మండల కేంద్రం కోటపాడు రోడ్డులో గల చైతన్య మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు పార్వతీపురం ఎస్‌బీఐ ఓల్డు స్టాఫ్ ఎస్.మధుసూదనరావు, సభ్యులు రూ. 50వేల విలువైన వాటర్ కూలర్‌ను వితరణగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ గత నెల 22న పెహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన జరజాపు సత్యచంద్రమౌళి జ్ఞాపకార్థం అందజేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గల మానసిక పిల్లలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తినిస్తాయన్నారు. ముందుగా ఆశ్రమంలోని 50 మంది మానసిక దివ్యాంగులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఓల్డు సిబ్బంది శశికుమారి, పతివాడ అప్పన్న, రెడ్డి రాంప్రసాద్, లక్ష్మీఅరుణ, ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకుడు భోజింకి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి



న్యాయమూర్తి కనకలక్ష్మికి స్వాగతిస్తున్న ఎస్.కోట న్యాయవాదులు

శృంగవరపుకోట: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా బి.కనకలక్ష్మి శుక్రవారం భాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో గజపతినగరం కోర్టు నుంచి ఈమె బదిలీపై ఎస్.కోట వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె బార్ అసోసియేషన్‌ను సందర్శించి న్యాయవాదులతో సమావేశం అయ్యారు. బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బి.వి.ఎస్.రామారావుల నేతృత్వంలో న్యాయవాదులు ఆమెకు దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరగా కేసులు పరిష్కరించటంలో న్యాయవాదులు సహకరించాలని, వాయిదాలకు అవకాశం లేకుండా కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, న్యాయవాదులు ఎం.దుర్గాప్రసాద్, అల్లు సత్యాజీ, జి.ప్రకాశ్, ఎన్.టి.వి.దాసు, బి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలకు సంప్రదించాలి

దత్తిరాజేరు: భూసారం పెరగడం కోసం పొలాల్లో చల్లేందుకు పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతు సేవ కేంద్రాలలో వీఏఏలను రైతులు సంప్రదించాలని ఏఓ అనురాధ శుక్రవారం తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డు నంబర్లు తెలియజేసి ఎన్ని కేజీలు కావాలో తెలియజేస్తే విత్తనాలు తెప్పించనున్నట్టు తెలిపారు.

అనుమతి లేకుండా డాబాలు నిర్వహిస్తే చర్యలు

నెల్లిమర్ల రూరల్: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా డాబాలు, హోటళ్లు నిర్వహిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ గణేష్ హెచ్చరించారు. మండలంలోని సతివాడలో అక్రమంగా నిర్వహిస్తున్న డాబాలపై గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. ఆల్తిపాలెం, సతివాడ జంక్షన్లలో ఉన్న రెండు హోటళ్లలో మద్యం సేవిస్తున్న 11 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అర్ధరాత్రి దాటిన వరకు అనుమతులు లేకుండా హోటళ్లు నిర్వహించడం సరికాదన్నారు. ఇదే ప్రక్రియను కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఇళ్లపై పెత్తనం వద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజులకళ్లాల పెద్దలు

శృంగవరపుకోట: పేదల ఇళ్లపై పెత్తందారుల పెత్తనం సహించేది లేదని సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ పేర్కొన్నారు. రాజులకళ్లాలకు చెందిన పేదలతో కలిసి తహసీల్దార్ అరుణకుమారికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. రాజులకళ్లాల వద్ద పేదలను ఇబ్బందులు పెట్టే చర్యలు మానుకోవాలని, పేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. గత పదిహేనేళ్లుగా గెడ్డ పక్క ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న వాళ్ల ఇళ్ల ముంగిళ్లలో గెడ్డ వెడల్పు చేస్తాం అంటూ మెట్ల వరకూ తవ్వేయటంతో ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. 15 కుటుంబాల వారు గత కొన్నేళ్లుగా ఇళ్లు కట్టుకుని ఉండగా ఖాళీ చేయించాలని అధికార పార్టీ నేతలు కొందరు చూస్తున్నారని ధ్వజమెత్తారు. గెడ్డలు ఆక్రమించి ఇళ్లు, స్కూళ్లు కట్టి వ్యాపారాలు చేస్తున్న వారు ఎస్.కోట పట్టణంలో పదుల సంఖ్యలో ఉన్నారని, వాళ్లని వదిలేసి పేదలపై అధికారం చెలాయించాలని చూస్తే సహించబోమని చెప్పారు. పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గెడ్డ పక్క ఇళ్లు నిర్మించుకున్న పేదలు అచ్చియ్యమ్మ, పద్మ, డి.లక్ష్మి, డి.కొండమ్మ, ఆర్.సూరమ్మ, ఎన్.నారాయణమూర్తి, సత్యవతి తదితరులు ఉన్నారు.